క్లుప్తంగా

అథ్లెటిక్స్‌లో సీఆర్‌ఆర్ విద్యార్థుల ప్రతిభ



అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన సీఆర్‌ఆర్ విద్యార్థులు

ఏలూరు రూరల్ : జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సీఆర్‌ఆర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ సీహెచ్‌ఎస్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో సెప్టెంబర్ 24న నిర్వహించిన సబ్ జూనియర్, జూనియర్స్ జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో సీఆర్‌ఆర్ విద్యార్థులు అండర్–18, –20 వయస్సు విభాగంలో 9 గోల్డ్ మెడల్స్, 10 సిల్వర్, 3 బ్రాంజ్ మెడల్స్ సాధిచారని వివరించారు. వీరు అక్టోబర్‌లో రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విజేతలను సీఆర్‌ఆర్ విద్యాసంస్థల మేనేజ్‌మెంట్ సెక్రటరీ ఎంబీఎస్‌వీ ప్రసాద్, కరస్పాండెంట్ ఎం జయప్రకాష్ అభినందించారని తెలిపారు.

కల్లా రాంబాబుకు డాక్టరేట్



రాంబాబు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : పెదవేగి జవహర్ నవోదయ విద్యాలయంలో కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ కల్లా రాంబాబుకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. తాను సి.గ్రేస్ ఇందిర పర్యవేక్షణలో ఇంపాక్ట్ ఆఫ్ సాఫ్ట్‌స్కిల్స్ ఆన్ ది పెర్సనాలిటీ ట్రెయిట్స్ ఆఫ్ ప్రాస్పెక్టివ్ టీచర్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందని రాంబాబు పేర్కొన్నారు. తాను రచించిన అనేక ఆర్టికల్స్ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయంగా అనేక మేగజైన్స్‌లో ప్రచురితమయ్యాయని తెలిపారు. భీమడోలు మండలం పూళ్ల గ్రామానికి చెందిన రాంబాబుకు లభించడం పట్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహోద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

30 నుంచి ఫొటోగ్రఫీలో ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని యూనియన్ (ఆంధ్రా బ్యాంక్) గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ యువతీ యువకులకు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ కె.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ ఈ నెల 30వ తేదీ నుంచి ప్రారంభిస్తామని, శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు ఉంటాయని పేర్కొన్నారు. 19 నుంచి 45 సంవత్సరాల్లోపు వయసు గల యువతీ యువకులు మాత్రమే అర్హులని, ఆసక్తి గల వారు సెల్ నెంబర్లు 99485 65256, 95330 79471లో తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, మూడు కలర్ పాస్‌పోర్ట్ ఫొటోలు వెంట తీసుకురావాలని వివరించారు.

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే లడ్డూ రాజకీయం

- సీఎం చంద్రబాబు వ్యాఖ్యలపై వైఎస్సార్ సీపీ కన్వీనర్ జయప్రకాష్ ఆగ్రహం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు





ఆర్‌ఆర్‌పేట వెంకటేశ్వరస్వామి ఆలయంలో చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని ప్రదక్షిణలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ఏలూరు ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్, మాజీ డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాస్, కార్పొరేటర్లు, నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : వంద రోజుల పరిపాలనలో సూపర్ సిక్స్ హామీలు అమలు కాకపోవటంతో ప్రజలను పక్కదారి పట్టించడానికే ముఖ్యమంత్రి చంద్రబాబు లడ్డూ రాజకీయానికి తెరలేపారని వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ కన్వీనర్ మామిళ్లపల్లి జయప్రకాష్ ఆరోపించారు. తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందని సీఎం చంద్రబాబు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను ఖండిస్తూ, తిరుపతి లడ్డూ విషయాన్ని అపవిత్రం చేసిన బాబుకు మంచి బుద్ధిని ప్రసాదించాలనే వేడుకుంటూ శనివారం స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, ఏలూరు నియోజకవర్గ కన్వీనర్ మామిళ్లపల్లి జయప్రకాష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ వందరోజుల పరిపాలనలో చంద్రబాబు తన వైఫల్యాలు కప్పిపుచ్చుకోవడానికి మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిపై అపవాదులు వేశారని, లడ్డూలో ఏనాడూ కల్తీ జరగలేదని వివరించారు. ప్రజలు టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని చీత్కరించుకుంటారని, లేని అపవాదులు జగన్‌పై వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమల వెళ్లకుండా జగన్‌ని అడ్డుకునేందుకు కుట్రలు చేశారని, జగన్ ప్రజలందరి మనిషి అని, ప్రజల కోసం వైఎస్సార్ కుటుంబం చేసిన సేవ ఎనలేనిదని వివరించారు. తిరుమల లడ్డూపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఏలూరులోని అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ పూజా కార్యక్రమంలో నెరుసు చిరంజీవి, మున్నుల జాన్ గురునాథ్, కిలాడి దుర్గారావు, దాసరి రమేష్, కార్పొరేటర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్ బాబు, జుజ్జువరపు విజయనిర్మల, ఇనపనూరి కేదారేశ్వరి జగదీష్, సుంకర చంద్రశేఖర్, ఎం.నిర్మల, జేవియర్ మాస్టర్, పల్లి శ్రీను, పెరికే వరప్రసాదరావు, ఎస్‌వీ శివారావు, వై.మోజేష్, మేతర సురేష్, మట్టా రాజు, కిలారపు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కృషి చేస్తేనే ఫలితం



మాట్లాడుతున్న సీపీడీసీ సభ్యుడు సుబ్బారావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని క్రమశిక్షణతో కృషి చేస్తే దేనినైనా సాధించవచ్చని సీపీడీసీ సభ్యుడు, సీనియర్ డెర్మటాలజిస్ట్ డి.సుబ్బారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం 2024 – 25 విద్యా సంవత్సరంలో చేరిన నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సీనియర్ విద్యార్థులు ఫ్రెషర్స్ డేని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుబ్బారావు మాట్లాడుతూ మూడేళ్ల కాలంలో ఎన్నో మధుర స్మృతులను పోగు చేసుకోవాలన్నారు. సీపీడీసీ సభ్యుడు ఎల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించుకోవడంలో జాగ్రత్తగా ఉండాలని, అనవసర అనర్థాలకు గురి కావద్దని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ సంప్రదాయంగా వస్తున్న ఫ్రెషర్స్ డేని నిర్వహిస్తున్న సీనియర్ విద్యార్థులను, నూతన విద్యార్థులను అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం రాంబాబు, సీనియర్ అధ్యాపకులు వి.వెంకట్రావులు మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పీఆర్ కావ్య శ్రీ,, వివిధ విభాగాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితం అంధకారం



యాంటీ ర్యాగింగ్ అవగాహన పోస్టర్లను ప్రదర్శిస్తున్న పోలీసులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : చదుకునే వయసులో తోటి విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడితే వారి జీవితాలు అంధకారమౌతాయని డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ తెలిపారు. ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు శ్రావణ్ కుమార్, ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు, మహిళా ఎస్సై కాంతిప్రియ ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్, సోషల్ మీడియా వల్ల కలిగే అనర్థాలపై కళాశాల ఆడిటోరియంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ర్యాగింగ్ ఒక సామాజిక రుగాత్మకగా తయారైందని, ర్యాగింగ్‌కు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ కేసుల్లో ఉంటే విద్యార్థులకు భవిష్యత్తు అంధకారమవుతుందని, ప్రతి ఒక్కరూ తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం కృషి చేయాలని, 20 సంవత్సరాలు కష్టపడి చదువుకుంటే 80 సంవత్సరాలు సుఖపడతారని వివరించారు. సోషల్ మీడియా ద్వారా సైబర్ నేరగాళ్లు ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు గాలం వేసే సంస్థలు ఎక్కువయ్యాయని, ఆన్‌లైన్‌లో వీరిచ్చే ప్రకటనలకు మోసపోవద్దని సూచించారు. సంస్థ కార్యాలయానికి వెళ్లి ఉద్యోగాలకు నోటిఫికేషన్ వెలువరించారో లేదో తెలుసుకోవాలని, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగాలంటూ వెలువడ్డ ప్రకటన చూసి అనేక మంది మోసపోయినవారున్నారని గుర్తు చేశారు. ఆన్‌లైన్‌లో లోన్లు తీసుకుని, డబ్బులు కట్టినా ఇంకా డబ్బులు కట్టాలని బెదిరింపు కాల్స్, అసభ్య పదజాలంతో ఫోన్ చేయడం, మెసేజ్‌లు పంపడం, ఏటీఎం సెంటర్లలో కార్డు క్లోనింగ్ ద్వారా డేటా సేకరించి డబ్బు మాయం చేయడం, బ్యాంక్ నుంచి ఫోన్ చేసినట్టు నమ్మించి ఖాతా, ఏటీఎం కార్డు నెంబర్, పిన్ నెంబర్ తీసుకుని అకౌంట్ నుంచి డబ్బు మాయం చేసే ముఠాలున్నాయని, అటువంటి వాటిపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

భద్రాచలం పుణ్యక్షేత్రానికి బస్సులను పునరుద్ధరించాలి



ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : శ్రీ సీతా రాములు తిరగాడిన, హిందువుల పవిత్ర పుణ్య క్షేత్రం భద్రాచలానికి ఏలూరు నగరం నుంచి ఆర్టీసీ బస్సులు నడపాలని శ్రీ స్వామి వివేకానంద ప్రజా పరిరక్షణ సమితి అధ్యక్షుడు కోలా భాస్కరరావు ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వినతి పత్రాన్ని ఏపీఎస్ ఆర్టీసీ రీజల్ మేనేజర్ కార్యాలయంలోని పర్సనల్ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి పి.వేణుగోపాల్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. గతంలో ఏలూరు నుంచి భద్రాచలం వరకు ఉదయం 7.30 గంటలకు, మధ్యాహ్నం 3.30 గంటలకు, రాత్రి 10.30 గంటలకు ప్రతిరోజూ మూడు ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసులను ఆర్టీసీ నడిపేదని, అయితే వాటిని రద్దు చేయడం వల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. రైలు మార్గం లేకపోవడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్టీసీ బస్సుపైనే ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు. రద్దు చేసిన మూడు సర్వీసులను వెంటనే పునరుద్ధరించాలని అధికారులకు భాస్కరరావు విజ్ఞప్తి చేశారు. దసరా మహోత్సవంలో భాగంగా విజయవాడ దుర్గమ్మ ఆలయానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడపాలని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చార్జీలు వసూలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పిట్ల సాయిబాబు, పి.చింతయ్య, సిరిబత్తిన శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాల కోసం శిక్షణ అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రాంతీయ ఉపాధి అధికారి రామమోహనరెడ్డి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : డిగ్రీ పూర్తి చేసిన తరువాత విద్యార్థులకు ఉద్యోగావకాశాలు రావాలంటే ప్రత్యేక శిక్షణ అవసరమని ప్రాంతీయ ఉపాధి అధికారి ఎన్ రామమోహన రెడ్డి అన్నారు. నగరంలోని సీఆర్ రెడ్డి అటానమస్ కళాశాల దృశ్య శ్రవణ మందిరంలో ఐక్యూఏసీ, కెరీర్ గైడెన్స్ – ప్లేస్మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో కెరీర్ అవకాశాలు – వృత్తి అభివృద్ధి అనే అంశంపై శనివారం అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామమోహనరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగావకాశాల కోసం ఎటువంటి శిక్షణ తీసుకోవాలి, ఏవిధంగా కృషి చేయాలి, ఏరంగంలో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్నాయనే అంశాలను వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ జి.రాము మాట్లాడారు. జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణ్‌రావు, ఏలూరు ఉపాధి అధికారి వి.వరలక్ష్మి, కెరీర్ గైడెన్స్ – ప్లేస్మెంట్ సెల్ కో ఆర్డినేటర్ బీవీఆర్‌డీ ఫణికుమార్, బీకాం తృతీయ సంవత్సర విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతినగర్‌లో భారీ చోరీ



చోరీ జరిగిన ఇంట్లో క్లూస్‌టీం

ఏలూరు టౌన్ : వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లగా ఇంటి తాళాలు పగులగొట్టిన దొంగలు ఇంట్లోని బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదును అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు శాంతినగర్ 12వ రోడ్డులో నివాసం ఉంటోన్న రావూరి జ్ఞానానందరావు బ్యాంకు ఉద్యోగిగా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. శస్త్ర చికిత్స నిమిత్తం ఆయన 15 రోజుల క్రితం తమ కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. ఈనెల 27న రాత్రి ఇంటి తాళాలు పగులగొట్టిన దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బీరువాను పగులగొట్టారు. బీరువాలోని 15 కాసుల బంగారు ఆభరణాలు, 10 కిలోల వెండి వస్తువులు, నగదును అపహరించి పరారయ్యారు. శనివారం ఉదయం పక్కింటి వారు చూసేటప్పటికి తలుపులు అన్నీ తీసి ఉన్నాయి. వెంటనే వారు ఇంటి యజమానికి ఫోన్ ద్వారా, మరోవైపు పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ డి.శ్రావణకుమార్, త్రి టౌన్ సీఐ కోటేశ్వరరావు, క్లూస్ టీమ్ సిబ్బంది, క్రైమ్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ చోరీపై ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కలు నాటి సంరక్షించండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వాతావరణంలో అసమతౌల్యాన్ని కొంతమేరకైనా తగ్గించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని స్థానిక సెయింట్ థెరిస్సా కళాశాల విద్యార్థినులు సూచించారు. పర్యావరణ పరిరక్షణ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఏబీసీయూఎఫ్, ఎకో క్లబ్, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఆ కళాశాల విద్యార్థినులు స్వచ్ఛతే సేవ అనే నినాదాలతో శనివారం స్థానిక ఇందిరా కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల, కాలనీ జంక్షన్లలో వీధినాటకం ప్రదర్శించారు. మొక్కలు నాటే కార్యక్రమం చేసి మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడంలో పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమాన్ని కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ సిస్టర్ సుశీల జండా ఊపి ప్రారంభించగా, న్యూట్రిషన్ విభాగం హెడ్ జ్యోతి కుమారి, ఏబీసీయూఎఫ్ ఇన్‌చార్జి ప్రతిమ, ఎకో క్లబ్‌కు చెందిన ప్రసన్న, పూజిత, బ్యూలా పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	19
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	34
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	09
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	27

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	26
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	32
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	18
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	21
ఏలూరు–బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	26
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	16
ఏలూరు – తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	46	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	68–100
వంకాయలు (కాంతులు)	48	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	07,10
బెండకాయలు	24	కంద	60
పచ్చిమిర్చి	26	బీట్‌రూట్	40
కాకర కాయలు	30–48	కీరా దోస	40
బీరకాయలు	34	ఫ్రెంచ్‌బీన్స్	76
బీరకాయలు (పందిరి)	44	అల్లం	70–150
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	30
క్యారెట్	40–54	పాలకూర	15
దొండకాయలు	38	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	12
ఉల్లిపాయలు	58	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	34–40	బఠాణీ	--
ఆనబకాయ (1)	30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20–25	చిలకదదుంప	58

విద్యారంగ దార్శనిక ప్రణాళికపై పోటీలు



పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తున్న డీఈఓ అబ్రహం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : స్వర్ణాంధ్ర – 2047 ప్రకారం విద్యారంగంలో దార్శనిక ప్రణాళిక తయారు చేయడంపై జిల్లా స్థాయిలో స్థానిక ఈదర సుబ్బమ్మ దేవి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం పోటీలు నిర్వహించినట్టు డీఈఓ ఎస్ అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అక్టోబర్ 2న బహుమతులు, సర్టిఫికెట్లు అందచేస్తామని పేర్కొన్నారు. కొన్ని పోటీలకు న్యాయ నిర్ణేతగా తాను, కార్యక్రమానికి అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఆర్ రామారావు నోడల్ పర్సన్‌గా వ్యవహరించారని తెలిపారు.

పోటీల విజేతలు వీరే..

వక్తృత్వం : ఆర్ మమత ప్రథమ, సీహెచ్ నిఖిల ద్వితీయ, జెన్నీ బాబు తృతీయ స్థానాల్లో నిలిచారు.

వ్యాసరచన : జి.కీర్తన ప్రథమ, జి.హర్షప్రియ ద్వితీయ, కె.వెంకట లహరి తృతీయ స్థానాల్లో నిలిచారు.

చర్చా పోటీలు : కేఎస్‌డీ రాకేష్ ప్రథమ, కె.నితిన్ చక్రవర్తి ద్వితీయ, ఎం కుసుమ తృతీయ స్థానాల్లో నిలిచారు.

ఆర్టీసీ ఉద్యోగాల భర్తీ చేపట్టాలి

ఏలూరు రూరల్ : ప్రభుత్వం ఆర్టీసీ సంస్థలో ఉద్యోగాల భర్తీ చేపట్టాలని రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ సీపీఎం శాఖ మహాసభ డిమాండ్ చేసింది. శనివారం ఏలూరులోని పార్టీ కార్యాలయంలో మహాసభ వివరాలను ఎం అరుణ కుమారి ఓ ప్రకటనలో వెల్లడించారు. ఉద్యోగులు అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు పెట్టిన సెలవు రోజులకు ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడం శోచనీయమని తెలిపారు. ఉద్యోగులపై పని ఒత్తిడి పెరుగుతున్నందున అనేక విభాగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను ప్రభుత్వం భర్తీ చేయాలని కోరారు. మహాసభ డిమాండ్లపై ప్రభుత్వం, ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేస్తున్న బాలబాలికలు

ఏలూరు రూరల్ : బాల్య వివాహాలు అరికట్టడంతో బాలబాలికలు సహకరించాలని చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ ఆర్ వినోద్ కోరారు. శనివారం శనివారపుపేట జెడ్పీ పాఠశాల విద్యార్థులకు బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాలపై ఆయన అవగాహన కల్పించారు. చిన్న వయస్సులో పెళ్లి చేసుకోవడం వల్ల బాలికలు గర్భందాల్చితే రక్తహీనత తదితర దీర్ఘకాలిక అనారోగ్యాల బారిన పడతారని తెలిపారు. పుట్టబోయే పిల్లలను సైతం అనేక మానసిక, శారీరక సమస్యలు చుట్టు ముడతాయని చెప్పారు. బాల్య వివాహాలు చేసే వారిపై చట్ట పరమైన చర్యలు ఉంటాయని వివరించారు. హెచ్‌ఎం గారపాటి ప్రకాష్ పిల్లలతో బాల్య వివాహాల నిర్మూలిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు.

కలెక్టరేట్ ఆవరణలో ఉద్యోగుల శ్రమదానం



కలక్టరేట్ ఆవరణలో శ్రమదానం చేస్తున్న ఉద్యోగులు

ఏలూరు(మెట్రో) : స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటి శ్రమదానం నిర్వహించారు. ఏలూరు కలెక్టరేట్‌లోని వివిధ శాఖల కార్యాలయాల్లో, పరిసరాల్లో శనివారం శ్రమదానం చేశారు. ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని ఆయా కార్యాలయాలను శుభ్రం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి కార్యాలయం ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి స్వచ్ఛ పరిరక్షణలో భాగస్వాములయ్యారు. జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, డ్వామా పీడీ ఎ.రాము, మున్సిపల్ కమిషనరు ఎన్.భానుప్రతాప్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం ముక్కంటి, కలెక్టరేట్ ఏఓ నాంచారయ్య, వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో కలెక్టరేట్ ప్రాంగణం, ప్రాంగణంలో ఉన్న వివిధ ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను, తొలగించిన చెత్తను, వ్యర్థాలను ట్రాక్టర్లలో వేశారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ విగ్రహం వద్ద స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేశారు.

అతిథి అధ్యాపక పోస్టులకు ఆహ్వానం

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో ఫిజికల్ గెస్ట్ లెక్చరర్స్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ నత్తాని యేలు అన్నారు. శనివారం ఆయన కళాశాలలో మాట్లాడుతూ దరఖాస్తుదారులు ఎంపీఈడీలో 55 శాతం మార్కులు పైబడి ఉండాలన్నారు. కళాశాల వెబ్‌సైట్ లేదా వ్యక్తిగతంగా కళాశాలలో, రిజిస్టర్ పోస్టులో వచ్చేనెల 3న సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తులు పంపవచ్చన్నారు.

హౌసింగ్ ఏఈగా వివేకానంద

దెందులూరు: దెందులూరు మండల గృహ నిర్మాణ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్‌గా వివేకానందను నియమిస్తూ కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాలు జారీ చేశారు. వివేకానంద చింతలపూడి మండల హౌసింగ్ ఏఈగా విధులు నిర్వహిస్తున్నారు.